بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Full Text of Friday Sermon Hazrat Khalifatul Masih V, 29 May 2026 (Telugu)

# హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన దాసుడైన హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం వినయ, విధేయతల సంఘటనలు, తమ సంస్థకు వినయ, వినమ్రతను అవలంభించాలనే హితబోధ

హజ్రత్ అమీరుల్ మోమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 29.05.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం

أَشۡهَدُ أَنۡ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحۡدَهٗ لَا شَرِيۡكَ لَهٗ وَأَشۡهَدُ أَنَّ مُحَمَّدًا عَبۡدُهٗ وَرَسُوۡلُهٗ۔ أَمَّا بَعۡدُ فَأَعُوۡذُ بِاللّٰهِ مِنَ الشَّيۡطٰنِ الرَّجِيۡمِ۔
بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ اَلۡحَمۡدُ لِلّٰهِ رَبِّ الۡعٰلَمِيۡنَ ○ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ ○ مٰلِكِ يَوۡمِ الدِّيۡنِ ○ اِيَّاكَ نَعۡبُدُ وَاِيَّاكَ نَسۡتَعِيۡنُ ○ اِهۡدِنَا الصِّرَاطَ الۡمُسۡتَقِيۡمَ ○ صِرَاطَ الَّذِيۡنَ اَنۡعَمۡتَ عَلَيۡهِمۡ غَيۡرِ الۡمَغۡضُوۡبِ عَلَيۡهِمۡ وَلَا الضَّآلِّيۡنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారి దాసునిగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కనబరిచిన వినయ, విధేయతలకు సంబంధించిన సంఘటనలను మరియు తమ సంస్థ సభ్యులకు వినయ, విధేయతలను అలవర్చుకోవాలని చేసిన హితబోధల గురించి ఈరోజు నేను కొంత వివరిస్తాను. వారి అలైహిస్సలాం వినమ్రతను చూసి స్వయంగా అల్లాహ్ తఆలానే దానికి సంబంధించిన ధృవీకరణను వారికి ప్రసాదించాడు. 1907 మార్చి 18న వారి అలైహిస్సలాంపై ఈ దైవవాణి అవతరించింది. నీ వినమ్రతతో కూడిన మార్గాలు అల్లాహ్‌కు నచ్చాయి.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ విధంగా ఉపదేశిస్తున్నారు. ఈ వినమ్ర సేవకునికి (నాకు) ఇట్లు తెలుపబడెను. ఈ అల్పుడు తన సాధారణత్వం, వినమ్రత, అల్లాహ్‌పై నమ్మకం, త్యాగం, దైవ సూచనలు, దివ్య కాంతుల పరంగా యేసు మొదటి జీవితానికి ఒక నమూనాగా ఉన్నాడు. ఈ వినమ్ర సేవకుడి స్వభావం, మసీహ్ స్వభావం ఒకదానికొకటి ఎంతో పోలిక కలిగి ఉన్నాయి. అవి ఒకే మూలపదార్థపు రెండు ముక్కలు లేదా ఒకే వృక్షపు రెండు పండ్లు అన్నట్లుగా ఉన్నాయి. వాటి మధ్య ఏకత్వం ఏ స్థాయిదనగా ఒకే రకమైన సామీప్యత ఉంది. ఆధ్యాత్మిక దృష్టిలో వాటి మధ్య వ్యత్యాసాన్ని గుర్తించడం ఎంతో సూక్ష్మమైన విషయం. అలాగే బాహ్యంగా కూడా ఒక పోలిక ఉంది. అది ఏంటంటే మసీహ్ ఒక సంపూర్ణ, గొప్ప ప్రవక్త అయిన మూసా (అ) అనుచరుడు, ఆయన ధర్మం సేవకుడు, ఆయన ఇంజీల్ గ్రంథం తౌరాత్‌కు ఒక శాఖగా ఉండింది. అలాగే ఈ వినమ్ర సేవకుడు కూడా, ప్రవక్తలందరికీ నాయకుడు మరియు సర్వ ప్రవక్తలకు కిరీటం వంటివారైన ఆ మహోన్నత ప్రవక్త హజ్రత్ మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి అత్యంత సామాన్యులైన సేవకులలో ఒకడు.

ఒకసారి ఒక వ్యక్తి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సేవలో ఇలా విన్నవించుకున్నాడు: హుజూర్! మీరు హకీకతుల్ వహీ పుస్తకాన్ని వ్రాయడంలో, దాని ప్రూఫ్ రీడింగ్‌లను పదేపదే చదవడంలో చాలా శ్రమపడ్డారు, దీనివల్ల మీ ఆరోగ్యం కూడా క్షీణించింది. కాబట్టి ఇప్పుడు కొన్ని రోజుల పాటు మీరు పూర్తిగా విశ్రాంతి తీసుకోండి. దానికి హుజూర్ అలైహిస్సలాం ఇలా బదులిచ్చారు: మన కష్టం అసలు ఎంతటిది? దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం అనుచరుల త్యాగాల వైపు చూసినప్పుడు మనకు సిగ్గు వేస్తుంది. వారు ఎంతటి సంతోషంతో దేవుని మార్గంలో తమ ప్రాణాలను సైతం అర్పించారో కదా!'

మరొక చోట ఆయన (అలైహిస్సలాం) ఇలా ప్రవచించారు: అల్పబుద్ధి గలవారు నేను నా అంతస్తులను పరిమితికి మించి పెంచుకుంటున్నానని ఆరోపిస్తున్నారు. నేను అల్లాహ్ తఆలా సాక్షిగా ప్రమాణం చేసి చెప్తున్నాను.

నేను నన్ను ఎటువంటి ప్రశంసలకు అర్హుడిగా భావించడం గానీ, నా గొప్పతనాన్ని చాటుకుని సంతోషపడటం గానీ నా స్వభావంలోనే లేదు. నేను ఎల్లప్పుడూ వినమ్రతతో, అజ్ఞాతంగా జీవించడానికే ఇష్టపడ్డాను. అయితే అల్లాహ్ తఆలా స్వయంగా నన్ను ముందుకు తీసుకురావడం, నాపై అవతరించిన తన సువార్తవాణిలో నా ప్రశంసను, గొప్పతనాన్ని ఎంతగానో వ్యక్తపరచడం నా అదుపులో లేని విషయం. ఈ ప్రశంస, గొప్పతనం అంతా వాస్తవానికి దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం గారిదే.

మహమ్మద్ అబ్దుల్ హక్ అనే ఒక ఆస్ట్రేలియన్ నవ ముస్లింతో ఆయన అలైహిస్సలాం ఇట్లన్నారు: మా సూత్రాలలో ఒకటి ఏమిటనగా మేము చాలా సాదాసీదా జీవితాన్ని గడుపుతాము. ఈ రోజుల్లో యూరప్ దేశాలు జీవితానికి అత్యావశ్యకాలుగా మార్చుకున్న ఆ ఆడంబరాలు, ఆర్భాటాలన్నింటికీ మా సభ చాలా దూరం. మేము ఎటువంటి ఆచారాలకు, అలవాట్లకు బానిసలం కాము...తినడం, తాగడం మరియు జీవన విధానంలో మేము సాదాసీదా జీవితాన్నే ఇష్టపడతాము.

మరొక చోట ఆయన అలైహిస్సలాం ఇలా ఉపదేశిస్తున్నారు. వినమ్రతను అలవర్చుకోవలెను. వినమ్రతను నేర్చుకోవడం అంత కష్టమేమీ కాదు, అసలు దానిని నేర్చుకోవడమేముంది? మనిషి స్వభావరీత్యానే స్వయంగా ఎంతో బలహీనుడు, వినమ్రుడు, అతను వినయం కోసమే సృష్టించబడ్డాడు. ఆయన అలైహిస్సలాం ఇంకా ఇట్లన్నారు: తమను తాము అందరికంటే అత్యంత అల్పులుగా, చిన్నవారిగా భావించుకుంటూ, ఎంతో అణకువతో మాట్లాడేవారు...భూమిపై ఎంతో వినమ్రతతో నడిచేవారు ధన్యులు. కాబట్టి నేను పదేపదే చెప్తున్నాను అలాంటి వారి కోసమే మోక్షం సిద్ధం చేయబడింది.

హుజూరె అన్వర్ ఇట్లన్నారు: కొంతమందికి జల్సా రోజుల్లో ముందు వరసల్లో ఉన్న కుర్చీలలో కూర్చోవాలని లేదా గ్రీన్ ఏరియా మొదలైన చోట్ల కూర్చోవాలని ఆకాంక్ష ఉంటుంది. ఖలీఫాకు దగ్గరగా ఉండి ఆయన మాటలు వినాలనే ఉద్దేశంతో ఆ ఆకాంక్ష ఉంటే అది సరైనదే, కానీ కొన్నిసార్లు అందులో అహం కూడా తోడవుతుంది. అలా జరగకూడదు. ఎందుకంటే దీనివల్ల నిర్వాహకులకు ఏర్పాట్లలో ఇబ్బందులు తలెత్తుతాయి.

హుజూర్ (అ) ఇట్లన్నారు: మనిషి ఎక్కడికైనా వెళ్ళినప్పుడు అందరికంటే క్రింది స్థానాన్ని తన కోసం ఎంచుకోవలెను. ఒకవేళ అతను అంతకంటే మెరుగైన స్థానానికి అర్హుడైతే ఆతిథ్యమిచ్చేవారే స్వయంగా అతడిని పిలిచి ఆ స్థానాన్ని ఇస్తారు.

ఆయన (అ) ఇంకా ఇట్లన్నారు: ఏ వ్యక్తి అయినా సరే, తనలో రెండు లక్షణాలు ఉత్పన్నమయ్యేంతవరకు దైవప్రేమను, దైవానుగ్రహాన్ని పొందలేడు. మొదటిది అహంకారాన్ని అణచి వేయడం. రెండవది అపవిత్రతకు, దైవాగ్రహానికి కారణమైన పూర్వపు బంధాలన్నింటినీ పూర్తిగా తెంచుకోవడం.

ఆయన (అ) ఇంకా ఇట్లన్నారు: బైఅత్ చేసిన తర్వాత కూడా తనలో స్వార్థాన్ని, అహాన్ని ఉంచుకునేవాడు ఎన్నటికీ ఆధ్యాత్మిక ప్రయోజనాన్ని పొందలేడు. మీరు ఎంతటి మృదుత్వాన్ని అవలంబిస్తారో, ఎంతగా వినమ్రతను, అణకువను ప్రదర్శిస్తారో, అల్లాహ్ తఆలా మీ పట్ల అంతగా ప్రసన్నుడవుతాడు. స్వభావరీత్యా ఎంతో బలహీనమైన సృష్టి అయిన మనిషి తన దుష్కర్మల ప్రభావం వల్ల తన్ను తాను గొప్పవాడిగా భావించుకోవడం ప్రారంభిస్తాడు. ఈ దుష్కర్మల వల్లే మనిషిలో గొప్పతనం అనే భావం పుడుతుంది, అలాగే అహంకారం, గర్వం అతడిలో చోటుచేసుకుంటాయి. దేవుని మార్గంలో మనిషి తన్ను తాను అందరికంటే చిన్నవాడిగా భావించనంతవరకు, అతడు (పాపాల నుండి మరియు అహంకారం నుండి) విముక్తి పొందలేడు.

ఆ తర్వాత, వినమ్రతను అలవర్చుకోవాలని హితబోధ చేస్తూ హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఒక సందర్భంలో ఇట్లు హితబోధ చేశారు. జమాఅత్‌లో ఇప్పటికీ చాలా మంది వ్యక్తులు తమ మనస్సుకు నచ్చని చిన్న మాట విన్నా సరే వెంటనే కోపానికి లేదా ఆవేశానికి గురవుతున్నారు. అయితే స్వభావంలో సహనం, ఓర్పు

పెంపొందడం కోసం అలాంటి ఆవేశాలన్నింటినీ అణచివేయడం ఎంతో అవసరం. ఒక చిన్న విషయానికే చర్చ మొదలైనప్పుడు, ఒకరినొకరు ఓడించాలనే ఆరాటంలో తానే ఎలాగైనా విజేతగా నిలవాలని చూస్తుండటం మనం గమనిస్తూనే ఉంటాము. అలాంటి సమయాల్లో ఆత్మగర్వం ఆవేశం నుండి దూరంగా ఉండాలి, వివాదాలను ముగించడం కోసం చిన్న చిన్న విషయాలలో తెలిసి బుద్ధిపూర్వకంగా తానే తగ్గింపును (వినమ్రతను) అంగీకరించాలి. పరస్పర పోటీలో తన తోటి సోదరుణ్ణి తక్కువ చేసి చూపించడానికి ఎంతమాత్రం ప్రయత్నించకూడదు. మనం మన జీవితాలను పరిశీలిస్తే, చాలా మందిలో ఇటువంటి తప్పుడు అహంభావం, అహం కనిపిస్తాయి, దీనివల్లనే గొడవలు కూడా పెరుగుతాయి. కానీ అల్లాహ్ తఆలా సామీప్యాన్ని పొందాలనుకుంటే, వీటి నుండి ముక్తి లభిస్తుంది. అంతేకాదు కొందరైతే ఇతరులకు నష్టం కలిగించడానికి కూడా ప్రయత్నిస్తారు. కొన్నిసార్లు తప్పుడు కోణంలో ఫిర్యాదులు చేస్తూ ఫలానా చోట నాతో గొడవ పడ్డాడు, ఫలానా చోట నన్ను దూషించాడు, కాబట్టి ఇప్పుడు నేను అతడిని ఏదో ఒక తప్పుడు పద్ధతిలో ఏదైనా తప్పుడు కేసులో లేదా శిక్షలో ఇరికించడానికి ప్రయత్నిస్తానని చూస్తుంటారు.

ఆయన అలైహిస్సలాం ఇట్లన్నారు. అహంకారి దేవుని సింహాసనంపై కూర్చోవాలని ఆశిస్తాడు. కాబట్టి ఈ అసహ్యకరమైన లక్షణం (గర్వం) నుండి ఎల్లప్పుడూ దేవుని రక్షణను వేడుకోండి. అల్లాహ్ తఆలా వాగ్దానాలన్నీ మీతో ఉన్నప్పటికీ, ఆ వాగ్దానాలు ఉన్నా సరే మీరు వినమ్రతనే ప్రదర్శించండి. ఎందుకంటే తన్ను తాను తగ్గించుకునేవాడే దేవునికి ప్రియమైనవాడు అవుతాడు.

ఒకసారి హుజూర్ (అ) ను ఇలా అడగనైనది. హుజూర్! ప్రవక్తలందరూ మేకలు కాశారని హదీస్‌లలో వస్తుంది కదా! మరి మీరెప్పుడైనా కాశారా? దానికి హుజూర్ (అ) ఇలా బదులిచ్చారు. అవును! ఒకసారి నేను బయట పొలాల వైపు వెళ్ళినప్పుడు అక్కడొక వ్యక్తి మేకలు కాస్తుండెను. నేను ఒక పని మీద వెళ్తున్నాను, మీరు కొంచెం నా మేకలను చూస్తూ ఉండండని అతడు నాతో చెప్పాడు. కానీ అతడు వెళ్ళినవాడు అలానే ఉండిపోయి, తిరిగి సాయంత్రానికి వచ్చాడు. అతడు వచ్చేంతవరకు మేము అతని మేకలను కాయాల్సి వచ్చింది.

హజ్రత్ మసీహ్ మౌవూద్ (అలైహిస్సలాం) ఇంటి పనులు చేయడంలో ఎన్నడూ ఎటువంటి సంకోచానికి గురయ్యేవారు కాదు. మంచాలు స్వయంగా పరుచుకునేవారు, తివాచీలు సర్దుకునేవారు, పరుపులు సిద్ధం చేసుకునే వారు. ఎలాంటి ఆహారమైనా సరే ఆయన అలైహిస్సలాం ఆనందంగా భుజించే వారు. ఆయన (అ) ఎవరితోనూ ఏకవచనంతో (నువ్వు అని) మాట్లాడలేదు, ఎల్లప్పుడూ గౌరవంగా 'జీ' (అండీ) అని సంబోధిస్తూ మాట్లాడేవారు. ఆయనలో అహంకారం అనే మాటే ఉండేది కాదు.

మౌల్వీ ముహమ్మద్ హుసేన్ బటాల్వి గారు ఢిల్లీ నుండి కొత్తగా విద్యనభ్యసించి తిరిగి వచ్చిన రోజుల్లో, హుజూర్ అలైహిస్సలాంతో ఆయనకు ఒక చర్చ జరిగింది. అందులో హుజూర్ (అ) మొదటగా మౌల్వీ గారిని ఆయన విశ్వాసాల గురించి అడిగారు. మౌల్వీ గారు తన విశ్వాసాలను వివరించినప్పుడు హుజూర్ (అ) మీ విశ్వాసాలలో అభ్యంతరకరమైన విషయం ఏదీ నాకు కనిపించడం లేదు. కాబట్టి మీతో చర్చించాల్సిన అవసరం లేదని అన్నారు. హుజూర్ (అ)ను అక్కడికి తీసుకువెళ్ళిన వారు దీనివల్ల తమకు అవమానం జరుగుతుందని ఎంతో ఆందోళన చెందారు. కానీ హుజూర్ (అ) అటువంటి తప్పుడు ప్రతిష్టలను ఎంతమాత్రం లెక్కచేయలేదు. హుజూర్ (అ) స్వయంగా ఇలా అన్నారు. మౌల్వీ గారి విశ్వాసాలను విన్న తర్వాత, వాటిలో ఎటువంటి అభ్యంతరకరమైన విషయం లేనందున కేవలం అల్లాహ్ ప్రీతి కోసమే ఆ చర్చను విరమించుకోవడం జరిగింది. ఆ రాత్రి అల్లాహ్ తఆలా దివ్యవాణి ద్వారా ఇలా తెలిపాడు. నీ దేవుడు నీ ఈ చర్య పట్ల ప్రసన్నుడయ్యాడు, అతను నిన్ను ఎంతగానో ఆశీర్వదిస్తాడు, ఏ స్థాయి వరకంటే రాజులు సైతం నీ వస్త్రాల ద్వారా శుభాలను అన్వేషిస్తారు.

మౌల్వీ ముహమ్మద్ హుసేన్ బటాల్వి గారికి ఆయన అలైహిస్సలాం వ్రాసిన ఒక లేఖలో తన అత్యంత వినమ్రతను వ్యక్తపరిచారు. ఆయన (అ) ఇట్లు వ్రాశారు. ఈ వినమ్ర సేవకుడు (నేను) ఒక నిరక్షరాస్యుడు, అజ్ఞాని,

నాలో ఎటువంటి ఆరాధనా లేదు, తపస్సూ లేదు. విద్య లేదు, యోగ్యతా లేదు. క్లుప్తంగా చెప్పాలంటే నా దగ్గర ఏమీ లేదు. అల్లాహ్ తఆలా వైపు నుండి ఒక ఆజ్ఞ అందినది మరియు అది ఖచ్చితమైనది, నిశ్చయమైనది. దానిని ఈ వినమ్ర సేవకుడు చేరవేశాడు. దీనిని నమ్మడం, నమ్మకపోవడం అనేది ప్రతి ఒక్కరి వ్యక్తిగత అభిప్రాయం మరియు విచక్షణపై ఆధారపడి ఉంటుంది.

హుజూర్ అలైహిస్సలాం తాను మసీహ్ ప్రతిరూపాన్నని ప్రకటించినప్పుడు మౌల్వీ ముహమ్మద్ హుసేన్ బటాల్వి తీవ్రంగా వ్యతిరేకించాడు. ఎంతో అసభ్యకరమైన లేఖలు వ్రాశాడు. తన పత్రిక అయిన ఇషాఅతుస్సున్నః లో కూడా ఆయన అలైహిస్సలాం పట్ల సభ్యత లేని పదాలను ఉపయోగించడం ప్రారంభించాడు. వీటన్నింటికీ విరుద్ధంగా హుజూర్ (అ) సహనం, ఓర్పు, వినమ్రతలకు సంబంధించిన అత్యున్నతమైన ఆదర్శాన్ని కనబరిచారు.

హుజూర్ అలైహిస్సలాం అలైహిస్సలాం మౌల్వీ ముహమ్మద్ హుస్సేన్ బటాల్వి గారికి రాసిన ఒక లేఖలో ఇలా పేర్కొన్నారు. నాకు గెలుపోటములతో ఎటువంటి సంబంధం లేదు, కేవలం దాసత్వం, దైవాజ్ఞను పాటించడమే నా ఉద్దేశం. ఈ వ్యతిరేకత వెనుక మీ (మౌల్వీ గారి) ఉద్దేశం మంచిదే అయి ఉంటుందని నేను భావిస్తున్నాను. కానీ, మీరు మొదట నాతో మాట్లాడి నా మూడు పుస్తకాలైన (1) ఫతహ్ ఇస్లాం (2) తౌజీహె మరామ్ (3) ఇజాలా ఔహామ్ లను పరిశీలించిన తర్వాత ఏదైనా వ్రాస్తే బాగుంటుందని నా అభిప్రాయం. మీలాంటి మిత్రులు నన్ను వ్యతిరేకించడానికి సిద్ధపడ్డారని నాకు ఎలాంటి బాధా, విచారమూ లేదు. ఎందుకంటే, ఈ అభిప్రాయ భేదం కూడా సత్యం కోసమే అయ్యుంటుంది.

మరొక లేఖలో ఆయన అలైహిస్సలాం మౌల్వీ గారికి ఇలా వ్రాశారు. నా ఉద్దేశంలో, ఉత్తమ ప్రవర్తనకు సంబంధించిన అన్ని సూత్రాలలో కెల్లా అల్లాహ్ తఆలా అణకువను, వినమ్రతను, లీనతను ఇష్టపడినట్లే అతడు అహంకారాన్ని నిర్మూలించే ప్రతి విధమైన తగ్గింపును ఎంతగానో ఇష్టపడతాడు. నైతికతలో మరే ఇతర విభాగాన్ని ఆయన అంతగా ఇష్టపడడు.

హుజూరె అన్వర్ ఇట్లు ఉపదేశించారు. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ప్రతి వ్యాఖ్య మరియు ప్రతి చర్య వినమ్రతతో నిండి ఉండేవి. ఆయనలో ఒకే ఒక్క అన్వేషణ ఉండేది, అది ఏమిటనగా అల్లాహ్ తఆలా ప్రసన్నతను, ప్రీతిని పొందడం మరియు దైవ ఏకత్వాన్ని ప్రపంచంలో వ్యాప్తి చేయడం.

హుజూర్ అలైహిస్సలాం మనకు కూడా ఇదే హితబోధ చేశారు. కావున అల్లాహ్ తఆలా మనకు కూడా ఈ విషయాలపై నడుచుకునే భాగ్యాన్ని ప్రసాదించుగాక! ఆమీన్.

---

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ - وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا - مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ - وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ - عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ - يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ - اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ -